
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్

మంగళవారం 4 మార్చి 2025

జిల్లాల వార్తలు


## పాఠశాలలకు యూత్ అండ్ ఈకో క్లబ్ నిధులు

సంగారెడ్డి అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు యూత్ అండ్ ఈకో క్లబ్ నిధులను విద్యాశాఖ మంజూరు చేసింది. జిల్లాలోని 1,209 పాఠశాలలకు రూ.44,23,000 విడుదల చేశారు. ప్రాథమిక పాఠశాలకు రూ.3వేలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.5వేల చొప్పున కేటాయించారు. ఇవేకాకుండా ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్ పథకం కింద ప్రతీ పాఠశాలకు రూ.వెయ్యి చొప్పున రూ.12.09 లక్షలను విద్యాశాఖ మంజూరు చేసింది.



ఎండలు..

## చల్లటి కుండలు

ఈసారి ఎండలు ముందుగానే మొదలయ్యాయి. ఎండలు మండుతున్న నేపథ్యంలో మార్కెట్‌లోకి మట్టి కుండలు వచ్చేశాయి. ఈ నేపథ్యంలో అమ్మకాలు సైతం జోరందుకున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. సంగారెడ్డిలోని భవానీ మందిర్ వద్ద పెద్ద సంఖ్యలో కుండలను వ్యాపారులు అమ్మకానికి ఉంచారు.

-సంగారెడ్డి అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి)



### కాంగ్రెస్‌లో గ్రూపుల లొల్లి

- సంగారెడ్డి, మెదక్ మినహా అంతటా ఇదే పరిస్థితి
- అధికారంలోకి వచ్చినా మారని తీరు
- పటాన్‌చెరు, గజ్వేల్‌లో రచ్చకెక్కిన విభేదాలు
- సిద్దిపేట, నర్సాపూర్, దుబ్బాకలో ఎవరికివారే...
- నామినేటెడ్ పోస్టులు, స్థానిక ఎన్నికలపై అస్పష్టత
- గందరగోళంలో కార్యకర్తలు
- నేడు మెదక్ పార్లమెంటు నేతలతో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి సమీక్ష

# హస్తవ్యస్తం

మెతుకుసీమ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు పెరుగుతున్నాయి. కొత్త.. పాత, సీనియర్లు.. జూనియర్లు అనే విభేదాలతో హస్తం పార్టీ అస్తవ్యస్తంగా తయారవుతోంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితి మరింత జటిలమైంది. కుమ్ములాటల కారణంగానే ఎంపీ ఎన్నికల్లో పార్టీకి ఓటమి ఎదురైందని.. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ లోటుపాట్లు తలెత్తాయని కార్యకర్తలు వాపోతున్నారు. స్థానిక ఎన్నికల్లోనూ నష్టం జరగొచ్చనే ఆందోళన వారిలో నెలకొన్నది. నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నవారికి ఎదురుచూపులు తప్పడం లేదు. ఈ కారణాల దృష్ట్యా నేడు మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల ముఖ్య నేతలతో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సమీక్ష నిర్వహించనున్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 3: మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి ఆపసోపాలు తప్పడం లేదు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మెదక్ నియోజకవర్గాన్ని హస్తగతం చేసుకోవడం మినహాయిస్తే ఆ తర్వాత ఆశించిన ఫలితాలు కనిపించలేదు. 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆరు చోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే గెలిచారు. మిగితా చోట్ల నియోజకవర్గ ఇన్‌చార్జులు ఉన్నప్పటికీ సంగారెడ్డి మినహాయిస్తే ఇతర నియోజకవర్గాల్లో అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరాయి.

### పటాన్‌చెరులో మూడు ముక్కలు

పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మూడు ముక్కలైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాటా శ్రీనివాస్‌గౌడ్ ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు. ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇక కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడి బీఎస్పీ నుండి పోటీచేసిన నీలం మధు తిరిగి కాంగ్రెస్‌లోనే చేరారు. ఎంపీగా పోటీచేసి ఓటమిపాలయ్యారు. ఈ ఇద్దరికీ పొసగక వేర్వేరు గ్రూపులు తయారయ్యాయి. తర్వాత బీఆర్ఎస్ నుంచి గెలిచిన గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో మూడో గ్రూపు ప్రారంభమైంది. ముగ్గురి నడుమ అంతర్గత కుమ్ములాటలు, విభేదాలు ఉన్నాయి. ప్రధానంగా కాటా శ్రీనివాస్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి వర్గాల పంచాయతీ పలుమార్లు గాంధీభవన్‌కు చేరింది. ముగ్గురి నడుమ దశాబ్దాల కాలంగా పార్టీని నమ్ముకున్న కార్యకర్తలంతా తీవ్ర నైరాశ్యంలో ఉన్నారు.

### గజ్వేల్, సిద్దిపేటలోనూ గ్రూపులు

గజ్వేల్ నియోజకవర్గంలో పార్టీ ఇన్‌చార్జి నర్సారెడ్డి వైఖరిపై ఆ పార్టీ నేతలే అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు వ్యతిరేకంగా గ్రూపులు కడుతున్నారు. పార్టీ ప్రయోజనాల కంటే సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని బాహాటంగా విమర్శిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం గజ్వేల్ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలోనే కాంగ్రెస్‌లోని గ్రూపు రాజకీయాలు బట్టబయలయ్యాయి. ఒకరిపై మరొకరు దాడులు చేసుకునేదాకా వెళ్లారు. మరో కాంగ్రెస్ నేత బండారు శ్రీకాంత్‌రావు వర్గానికి, నర్సారెడ్డి వర్గానికి పొసగడం లేదు. దీనికి తోడు డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి సైతం సొంతంగా గ్రూపును తయారు చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఇక సిద్దిపేట నియోజకవర్గంలో గడిచిన 40 ఏళ్ల నుంచి కాంగ్రెస్ గెలిచింది లేదు. కానీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో టికెట్ ఆశించేవారి సంఖ్య పదుల్లో ఉంటుంది. ఏళ్ల తరబడిగా పార్టీలో కష్టపడుతున్నవారితో పాటు గత ఎన్నికల సమయంలో కొత్తగా కొందరు పార్టీలో చేరారు. దీంతో పదవుల కోసం, స్థానిక ఎన్నికల్లో సీట్ల కోసం గ్రూపులు కట్టారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి, మంత్రులు, పార్టీ ముఖ్యనేతల పేరు చెప్పుకుంటూ ఇక్కడ గ్రూపులు తయారయ్యాయి.

### దుబ్బాక, నర్సాపూర్‌లోనూ ఇదే పరిస్థితి

దుబ్బాక నియోజకవర్గంలో కాంగ్రెస్ ఇన్‌చార్జిగా చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నేతలు శ్రావణ్‌కుమార్ రెడ్డి, మద్దుల సోమేశ్వర్‌రెడ్డి గ్రూపులు ఉన్నాయి. రాష్ట్రంలోని చాలా నియోజకవర్గాల్లో నామినేటెడ్ పదవుల భర్తీ జరుగుతుండగా దుబ్బాకలో ఆ పరిస్థితి లేకపోయింది. పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా మార్కెట్ కమిటీలు, ఆత్మ కమిటీలను భర్తీ చేయలేదు. కూడవెల్లి రామలింగేశ్వర స్వామి పాలకమండలి నియామకం వివాదాస్పదంగా మారింది. ఈ విషయంలో ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి సరిగ్గా వ్యవహరించలేదనే అభిప్రాయాలు నెలకొన్నాయి. నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నేతలంతా కలిసి ఉన్నామన్నట్లుగానే కనిపిస్తున్నా ఎవరికి వారు ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారని చెప్పుకుంటున్నారు. నియోజకవర్గంలో ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి ముఖ్యనేతలుగా ఉన్నారు. గ్రూపుల ప్రభావంతో క్షేత్రస్థాయిలో కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు.

## బడ్‌చిప్.. బహుబాగు

- చెరుకులో నారు నాటే పద్ధతి
- తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి
- అవగాహన కల్పిస్తున్న డీడీఎస్- కేవీకే



7

## ఇలా కూల్చగానే.. అలా నిర్మాణం

- కాజీపల్లిలో రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు
- నామమాత్రపు చర్యలకే పరిమితమైన అధికారులు
- క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజల విజ్ఞప్తి



8

## ముగిసిన కోటి రుద్రాక్షల లింగోత్సవం

జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో భక్తుల సందడి

7





చేగుంట మండలం రుక్మాపూర్‌లో వరిని కాపాడుకోవడానికి ట్యాంకర్ ద్వారా నీరందిస్తున్న రైతు (చేగుంట, ఆంధ్రజ్యోతి)

# పాతాళానికి జలం

- మెదక్ జిల్లాలో ఇంకిపోతున్న భూగర్భ జలాలు
- నార్సింగిలో 25.46 మీటర్ల లోతుకు నీళ్లు
- రానున్న రోజుల్లో మరింత తగ్గే అవకాశం
- గత యాసంగి కంటే తగ్గిన వరి విస్తీర్ణం
- జిల్లాలో 75 శాతం బోర్లు, బావుల ఆధారంగా సాగు
- ఆందోళనలో రైతాంగం

మెదక్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. మెదక్ జిల్లాలో గత సంవత్సరం నవంబర్ నుంచి ఈసారి ఫిబ్రవరి వరకు నాలుగు మీటర్ల లోతుకు జలాలు తగ్గిపోయాయని అధికారుల నివేదికలు పేర్కొంటున్నాయి. జిల్లాలో వానాకాలం సీజన్ చివర్లో భారీ వర్షాలు కురిసినప్పటికీ ఆశించిన స్థాయిలో భూగర్భ జలమట్టాలు పెరగలేదు. జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో బోర్లపైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు పొలాలకు ఇబ్బంది లేనప్పటికీ రానున్న రోజుల్లో ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

### తగ్గిన వరిసాగు విస్తీర్ణం

జిల్లాలో యాసంగిలో వరి సాగు విస్తీర్ణం గతేడాదితో పోలిస్తే తగ్గినట్లు వ్యవసాయశాఖ అధికారులు వెల్లడించారు. గత యాసంగిలో 2.70 లక్షల ఎకరాల విస్తీర్ణంలో రైతులు వరి సాగు చేశారు. ఈ సంవత్సరం 2,58,487 ఎకరాల్లోనే నాట్లు వేశారు. జిల్లా వ్యాప్తంగా 7,972 చెరువులున్నా అత్యధికంగా బోర్లపైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. జిల్లాలోని ఏకైక మధ్యతరహా ప్రాజెక్టు ఘనపురం ఆనకట్ట నుంచి రెండు కాల్వల ద్వారా మెదక్, కొల్చారం, పాపన్నపేట, హవేళీఘనపురం మండలాల పరిధిలో సుమారు 25 వేల ఎకరాల మేరకు నీరందిస్తున్నారు. మిగిలిన రెండు లక్షల ఎకరాల్లో బోర్లపైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. జిల్లాలో 1.05 లక్షల వ్యవసాయ బోర్లు ఉన్నాయి.

### పెరిగిన ఎండల తీవ్రత

ఈసారి ఫిబ్రవరి చివరి నుంచే ఎండల తీవ్రత పెరిగింది. దీంతో బోర్ల వినియోగం పెరిగి భూగర్భ జలాలను తోడేస్తున్నారు. గత నవంబరులో జిల్లాలో సగటు భూగర్భ జలాలు 9.21 మీటర్లుగా ఉండగా.. జనవరి మాసంలో 10.94 మీటర్లలో నీరు లభ్యమైంది. ఫిబ్రవరి మాసాంతానికి 13.25 మీటర్ల లోతుకు పడిపోయాయి. అత్యధికంగా నార్సింగి మండలం కేంద్రంలో 25.46 మీటర్ల లోతుకు జలాలు కృంగి పోవడం రైతులను కలవరపెడుతున్నది. శివ్వంపేట, టేక్మాల్, తూప్రాన్, అల్లాదుర్గం, చేగుంట, చిలప్‌చేడ్, కుల్చారం, కౌడిపల్లి, మాసాయిపేట, నర్సాపూర్, నిజాంపేట, రామాయంపేట, రేగోడ్, మెదక్, పెద్దశంకరంపేట, చిన్నశంకరంపేట, వెల్దుర్తి మండలాల పరిధిలో 10-20 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు తగ్గిపోయినట్లు ఆ శాఖ తన నివేదికలో పేర్కొంది. గత ఐదేళ్లలో కురిసిన భారీ వర్షాల మూలంగా జిల్లాలో భూగర్భ జలమట్టాలు పెరిగినప్పటికీ.. ఈసారి పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు.



రాంపూర్ వద్ద పొలాలను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్

### పొలాలను పరిశీలించిన కలెక్టర్

కొల్చారం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వనదుర్గ ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మాచారం, రాంపూర్ పరిధిలో ఘనపురం ప్రాజెక్టు కాల్వలను ఇరిగేషన్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాజెక్టుల్లో నిల్వల ఆధారంగా నీటిని సమర్థంగా వాడుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సింగూర్ ప్రాజెక్టు నుంచి వనదుర్గ ప్రాజెక్టుకు 4.06 టీఎంసీల నీటి కేటాయింపు ఉందని పేర్కొన్నారు. ప్రాజెక్టు ద్వారా జిల్లాలో 21,625 ఎకరాలకు సాగు నీరు సరఫరా చేయాల్సి ఉందని వెల్లడించారు. ఏప్రిల్ చివరి వరకు సాగునీరు సరఫరా చేస్తామని కలెక్టర్ తెలిపారు. చివరి ఆయకట్టు వరకు నీరందేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఆయన వెంట ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, ఏఈ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఆలయ భూమి

## కబ్జాను ఉపేక్షించేది లేదు

మెదక్ మున్సిపాలిటీ : వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన భూమిని కబ్జా చేస్తే ఉపేక్షించబోమని ఉమ్మడి మెదక్ జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు. 'కబ్జా చెరలో ఆలయ భూమి' అన్న వార్తకు స్పందించిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. కబ్జా విషయం తనకు తెలియదని, ఏడుపాయల జాతర పనుల్లో నిమగ్నమై ఉండటంతో భూమిని పరిశీలించలేదని తెలిపారు. కబ్జా జరిగినట్టు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు

పట్టణానికి చెందిన వేణుగోపాలస్వామి ఆలయ భూమిని కబ్జా నుంచి కాపాడాలని 11వ వార్డు వాసులు అదనపు కలెక్టర్ మెంచు నగేష్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. తమ కాలనీలో సర్వే నంబర్ 1128లో వేణుగోపాలస్వామి ఆలయ భూమి 1.03 ఎకరాలు ఉందని, ఇందులో కొంత స్థలం కబ్జాకు గురైందని వారు తెలిపారు. గతంలో కొంతమంది కబ్జాకు ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకొని ఆలయ భూమిగా పేర్కొంటూ బోర్డును ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. నాలుగు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు అదే ఆలయ స్థలంలో హద్దురాళ్లు ఏర్పాటు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆలయ భూమిని కాపాడాలని వారు కోరారు.



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేస్తున్న కాలనీవాసులు



సంగారెడ్డిలో విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్

## ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- రేపటి నుంచి ప్రారంభం
- హాల్‌టికెట్‌పై సెంటర్ లొకేషన్ క్యూఆర్ కోడ్
- ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా అనుమతి
- సంగారెడ్డి జిల్లాలో 54 కేంద్రాలు.. 34,614 మంది విద్యార్థులు
- మెదక్ జిల్లాలో 30 సెంటర్లలో పరీక్ష రాయనున్న 12,484 మంది

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈ నెల 5 నుంచి 25 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని సంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్, మెదక్ జిల్లా ఇన్‌చార్జి ఇంటర్ విద్యాధికారి మాధవి వేర్వేరుగా తెలిపారు. ఆయా జిల్లా కేంద్రాల్లో వారు విలేకరులతో మాట్లాడుతూ పరీక్షల ఏర్పాట్లను వివరించారు. సంగారెడ్డి జిల్లాలో 54 పరీక్ష కేంద్రాల్లో 34,614 మంది పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. ఇందులో ఫస్టియర్ 16,513 మంది, సెకండియర్ 18,101 మంది పరీక్షలు రాస్తారని పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో 30 కేంద్రాల్లో 12,484 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని వివరించారు. ప్రథమ సంవత్సరం 6,066 మంది, ద్వితీయ సంవత్సరం 6,418 మంది పరీక్షలు రాస్తారని తెలిపారు. కేంద్రానికో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 24 మంది విద్యార్థులకో ఇన్విజిలేటర్ చొప్పున నియమించినట్లు వారు తెలిపారు.

### నిమిషం నిబంధన అమలు

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, 8.15 గంటల నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా 8.45 గంటల లోపే కేంద్రాల్లోకి చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించరని స్పష్టం చేశారు. హాల్‌టికెట్‌పై కళాశాల ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకొని పరీక్ష రాయవచ్చని తెలిపారు. సెంటర్ లొకేషన్ తెలిసేలా హాల్‌టికెట్‌పై ఈసారి క్యూఆర్ కోడ్ ముద్రించినట్లు వెల్లడించారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయని, హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ నుంచి అధికారుల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఎటువంటి వాచీలకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

## చిరుత సంచారం.. భయం.. భయం..

### పొలాల్లోకి ఒంటరిగా వెళ్లొద్దంటూ రామయంపేట శివారులో ఫెక్సీలు

రామాయంపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట మండల కేంద్రానికి అతి సమీపంలో చిరుత సంచరిస్తున్న ఆనవాళ్లు బయటపడటం రైతులకు ఆందోళన కలిగిస్తున్నది. బైపాస్ రోడ్డును ఆనుకొని ఉన్న కొయ్యగుట్ట సర్వేయకుంట, డబుల్ బెడ్‌రూం కాలనీ మీదుగా మున్సిపల్ డంపు యార్డు పరిసరాల్లో చిరుత సంచరిస్తున్నట్లు గుర్తించారు. పది రోజుల వ్యవధిలో ఈ ప్రాంతంలో రెండు జంతువులను చంపడంతో ప్రజలు భయపడుతున్నారు. పట్టణ శివార్లలో వందలాది ఎకరాల్లో పంట పొలాలు ఉండటంతో నిత్యం రైతులు పగలంతా పనులు చూసుకొని, రాత్రి పశువులను పొలాల వద్దనే కట్టేసి వస్తారు. పదిహేను రోజులుగా చిరుత సంచారం కలకలం రేపుతున్నది. పొలం వద్ద కట్టేసిన ఓ గేదెను, కుక్కను చిరుత చంపింది. వరుస సంఘటనలతో మూడు రోజుల క్రితం అటవీశాఖ, పోలీసు అధికారులు విచారణ జరిపి రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లొద్దని, పశువులను చేల వద్ద కట్టేయొద్దంటూ హెచ్చరిస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. చిరుత ఆనవాళ్లు గుర్తించిన ప్రదేశం పక్కనే డబుల్ బెడ్రూం ఇళ్లు ఉండటంతో కాలనీవాసులు భయంతో వణికిపోతున్నారు. అటవీశాఖ అధికారులు మాత్రం త్వరలోనే చిరుతను సేఫ్‌జోన్‌లోకి తరలిస్తామని పేర్కొంటున్నారు.





రామాయంపేట శివారులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



చిరుత పాదముద్ర

### రంజాన్ వేళలు

మంగళవారం ఇఫ్తార్: సాయంత్రం 6.29

బుధవారం సహర్: ఉదయం 5.10

## రాజీ మార్గమే రాజమార్గం

### 8న లోక్‌అదాలత్ : సంగారెడ్డి ఎస్పీ

సంగారెడ్డి క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాజీకి అవకాశమున్న కేసులను ఈ నెల 8వ తేదీన జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించాలని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ సిబ్బందికి సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి సోమవారం ఆయన పోలీసు అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న కేసుల్లో రాజీ పడేలా ఇరువర్గాలకు అవగాహన కల్పించాలని సూచించారు. కానిస్టేబుల్ నుంచి అధికారుల వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి వీలైనన్ని కేసులు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ వెల్దుర్తి మండల ఉపాధ్యక్షుడిగా బాలకిషన్

వెల్దుర్తి, మార్చి3(ఆంధ్రజ్యోతి) : బీజేపీ వెల్దుర్తి మండల ఉపాధ్యక్షుడిగా బాలకిషన్ నియమితులయ్యారు. సోమవారం వెల్దుర్తిలో పార్టీ మండల అధ్యక్షుడు దాసు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో ఆయనను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అనంతరం బాలకిషన్ మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. నాయకులు శేఖర్‌గౌడ్, వెంకటేష్, శ్రీనివాస్, శివరాములు తదితరులు ఉన్నారు.

# మండుటెండల్లో మత్తళ్లు

సిద్దిపేట జిల్లాలోని చెరువులు మండుటెండల్లో మత్తళ్లు పోస్తున్నాయి. రంగనాయక సాగర్ నుంచి నీటిని విడుదల చేయడంతో ఎడమ కాల్వ ద్వారా పారుతున్న నీటితో చెరువులు, చెక్ డ్యామ్‌లు నిండి పరవళ్లు తొక్కుతున్నాయి. దీంతో రైతులు వ్యవసాయ పనులు ముమ్మరం చేస్తున్నారు. నర్సాపూర్ చెరువు అలుగు పోస్తుండటంతో ఎండవేడికి చిన్నా పెద్ద స్నానాలు చేస్తున్నారు.

\- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట


అలుగు పారుతున్న నర్సాపూర్ చెరువు


పూర్తిగా నిండిన పెద్దకోడూర్ చెరువు


మత్తడి దూకుతున్న మండపల్లి చెక్‌డ్యామ్

## క్రైం కార్నర్

### ఇరవై రోజుల్లో పెళ్లి.. అనుమానాస్పదంగా మృతి


సునీల్ (ఫైల్)

నాగల్‌గిద్ద, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇరవై రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి మృతి చెందాడు. మండలంలోని గంగారం తండాకు చెందిన చౌహాన్ విఠల్ మూడో కుమారుడు సునీల్(20) హైదరాబాద్‌లో పానీపూరి బండి నడుపుతూ అక్కడే ఉంటున్నాడు. అతనికి 15 రోజుల క్రితం ఓ యువతితో నిశ్చితార్థం జరిగింది. ఈ నెల 26న పెళ్లి చేయాలని పెద్దలు నిర్ణయించారు. గత శుక్రవారం రాత్రి సునీల్ తన సోదరుడైన అనిల్‌కు ఫోన్ చేసి పచ్చకామెర్ల మందు కోసం శనివారం పిట్లం వెళ్తున్నానని.. మందు తీసుకుని ఇంటికి వస్తానని చెప్పాడు. మనూరు మండలం పుల్‌కుర్తి చెరువులో సునీల్ చనిపోయి ఉన్నాడని సోమవారం కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీంతో వారు వెళ్లి చూడగా, చెరువులో శవమై కనిపించాడు. 20 రోజుల్లో పెళ్లి జరగాల్సిన కుమారుడి మరణంపై అనుమానం ఉందని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### మల్లంపేటలో మరొకరు..

పాపన్నపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లంపేటకు చెందిన గంగన్నోల్ల రత్నయ్య (55) అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రత్నయ్య కూలీ పనులు చేస్తాడు. ఆదివారం రాత్రి ఇంట్లో భోజనం చేసి, అదే గ్రామంలో తన కుమార్తె ఇంటి వద్ద ఎవరు లేకపోవడంతో అక్కడ నిద్ర పోయేందుకు వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో స్థానికులు చూడగా రత్నయ్య ఇంట్లో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. తన తండ్రి మృతిపై అనుమానం ఉందని కుమార్తె ఉషా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### చెరువులో మునిగి వ్యక్తి మృతి


సాయికుమార్(ఫైల్)

శివ్వంపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి నీట మునిగి చనిపోయాడు. ఈ ఘటన మండలంలోని బిజిలిపూర్ గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సాయికుమార్ ఈ నెల 1న రాత్రి చేపలు పట్టేందుకు వెళ్తున్నానని చెప్పి, వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. సోమవారం స్థానిక వీరప్ప పెద్ద చెరువు వద్ద చూడగా, శవమై కనిపించాడు. మద్యం మత్తులో చెరువు వద్దకు వెళ్లి అందులో పడి చనిపోయి ఉంటాడని సోదరి శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై మధుకర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### అప్పుల బాధతో ఆత్మహత్య

మనోహరాబాద్ మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సుభాష్‌గౌడ్ కథనం ప్రకారం.. మండలంలోని లింగారెడ్డిపేట్ గ్రామానికి చెందిన పిట్ల రాజు(44) కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం కొత్త ఇల్లు కట్టాడు. పెద్ద కుమార్తె పెళ్లి చేయాలనే ప్రయత్నాల్లో ఉన్నాడు. అయితే, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న రాజు కొన్ని రోజులుగా మనస్థాపంతో బాధపడేవాడు. సోమవారం ఇంట్లో నుంచి వెళ్లి గ్రామ శివారులోని ఓ పొలంలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. రైతులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. రాజుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

### స్నేహితుడి అన్న పెళ్లికి వచ్చి వెళ్తూ..

#### బైక్‌పై నుంచి పడి యువకుడి దుర్మరణం


సాయినిఖిల్(ఫైల్)

నర్సాపూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి అన్న పెళ్లికి వచ్చి.. తిరుగు ప్రయాణం అవుతున్న ఇద్దరు స్నేహితుల బైక్ అదుపుతప్పి బోల్తా పడటంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాల పాలైన ఘటన నర్సాపూర్ సమీపంలో జాతీయ రహదారిపై అయ్యప్ప ఆలయం సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై లింగం కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి శాంతినగర్‌కు చెందిన సాయినిఖిల్(21), మరో స్నేహితుడు మనీష్‌లు బైక్‌పై ఆదివారం ఉదయం మెదక్‌లో తమ స్నేహితుడి అన్న పెళ్లికి హాజరై రాత్రి తిరుగుప్రయాణం అయ్యారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో అతివేగంగా వస్తూ అయ్యప్ప ఆలయం మూలమలుపు వద్ద వారి బైక్ అదుపు తప్పి పల్టీ కొట్టింది. దీంతో సాయినిఖిల్ అక్కడికక్కడే మృతి చెందగా, మనీష్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. అతడిని మొదట నర్సాపూర్ ఆస్పత్రికి అక్కడి నుంచి సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. సాయినిఖిల్ మృతదేహానికి నర్సాపూర్ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. డిగ్రీ మొదటి సంవత్సం చదువుతున్న సాయినిఖిల్ తండ్రి రవి ఉపాధి కోసం దుబాయ్‌లో ఉన్నాడు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరు..

కొండపాక, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని మోటార్ సైకిల్ ఢీ కొట్టడంతో తీవ్రగాయాలైన వ్యక్తి ఆస్పత్రిలో సోమవారం మృతి చెందాడు. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని మంగోల్ గ్రామానికి చెందిన తోడేటి పెంటయ్య(60) మెదినీపూర్‌లో బంధువుల వివాహానికి వెళ్లాడు. ఆదివారం రాత్రి అక్కడి నుంచి నడుచుకుంటూ కొండపాకలోని బంధువుల ఇంటికి వెళ్తుండగా, హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న మోటార్‌సైకిల్ ఢీకొని తీవ్రగాయాలు అయ్యాయి. 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడి నసుంచి ఆర్‌వీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఫోన్ కోసం భార్యాభర్త గొడవ

#### ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఇల్లాలు


ఎంబరి పవిత్ర

శివ్వంపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఫోన్ కోసం భర్తతో గొడవపడి భార్య ఇంట్లో నుంచి వెళ్లిన ఘటన సోమవారం మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో వెలుగుచూసింది. గ్రామానికి చెందిన గొల్ల నాగరాజు, కొల్చారం మండలం కిష్టాపూర్‌కు చెందిన ఎంబరి పవిత్ర (19)కి ఏడు నెలల క్రితం వివాహం జరిగింది. ఇటీవల తల్లి గారింటికి వెళ్లిన పవిత్ర ఇంటి నుంచి ఫోన్ తెచ్చుకుంది. ఫోన్ నేను ఇప్పిస్తా.. ఇంటి నుంచి ఎందుకు తెచ్చుకున్నావని ఆదివారం భర్త మందలించాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. భర్త సోమవారం ఉదయం పనికివెళ్లి, మధ్యాహ్నం వచ్చాడు. భార్య కనిపించకపోవడంతో ఇంట్లో ఉన్న తల్లిని అడిగాడు. తాను రెండు గంటలకు పడుకున్నానని ఎటువెళ్లిందో తెలియదని చెప్పింది. చూడ గా, ఫోన్ ఇంట్లో ఉంది. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై మధుకర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# బడ్‌చిప్.. బహుబాగు

- చెరకులో నారు నాటే పద్ధతి
- తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి
- అవగాహన కల్పిస్తున్న డీడీఎస్- కేవీకే

జహీరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ ప్రాంతంలో చెరకు సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఇక్కడ ఎర్ర, గరుకు నేలలు ఉండటంతో ఎక్కువ మంది చెరకు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయంలో నూతన సాంకేతిక చోటు చేసుకుంటుండగా ఇక్కడి చెరకు రైతులు ఇంకా సంప్రదాయ పద్ధతిలోనే సాగు చేస్తున్నారు. దీంతో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు చెరకుసాగులో అధునాతన పద్ధతుల వైపు రైతులను మళ్లించేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. బడ్‌చిప్ విధానంలో సాగు చేస్తే నాణ్యమైన అధిక దిగుబడి సాధించవచ్చునని చెబుతున్నారు.




### విత్తన శుద్ధి ఇలా..

చెరకు విత్తనం తీసుకువచ్చిన తర్వాత కూలీలు లేదా యంత్రాల ద్వారా గడలకు ఉన్న కన్నులు (ముచ్చులు) తొలగించాలి. అలా తొలగించిన కన్నులను ఒక దగ్గర పోగు చేసి, ట్రేలలో ఏర్పాటు చేసిన గడుల్లో కోకాపీట్, సేంద్రియ ఎరువులతో నింపి అందులో చెరుకు కన్నులు వేయాలి. నారుమడుల తరహాలో సుమారు 25 నుంచి 30 రోజుల వరకు పాలీ హౌజ్‌లను ఏర్పాటు చేసి పెంచాలి. పెరిగిన చెరుకు నారును మొక్కకు.. మొక్కకు మధ్య 20 నుంచి 30 సెంటీమీటర్ల దూరంలో ఉండేలా జంట సాళ్ల పద్ధతిలో నాటుకోవాలి. జంట సాళ్ల మధ్య సుమారు 75 నుంచి 80 సెంటీమీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలి. ఇలా చెరకు నాటడం వల్ల మొక్క బలంగా ఉండటంతో పాటు పిలకలు ఎక్కువగా వస్తాయి. ఇలా సాగు చేస్తే ఎకరాకు 40 టన్నుల నుంచి 50 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

### 23 వేల ఎకరాల్లో..

జహీరాబాద్ ప్రాంతంలో వాణిజ్య పంటలతో పాటు ప్రధాన పంటగా చెరకును సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు 23 వేల ఎకరాల్లో చెరకు సాగు అవుతుండగా, కొత్త పద్ధతులు, వంగడాలను ఎంచుకుని సాగు చేస్తే అధిక దిగుబడి, లాభాలు పొందవచ్చునని అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే, పంట తీసే సమయంలో కూలీల కొరత, క్రషింగ్ కోసం సకాలంలో పర్మిట్లు దొరకకపోవడం, ఈ ప్రాంతంలోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారం మూతపడటంతో పండిన పంటను కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు తరలించడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు.

### ఎకరాకు రూ. 55వేల ఖర్చు

అన్ని రకాల వాతారణాలకు తట్టుకుని పండే పంట కావడం, దిగుబడి అటు ఇటు అయినా గిట్టుబాటు అవుతుండటంతో రైతులు చెరుకు సాగు చేస్తున్నారు. చెరకు సాగులో రైతులు చెరుకు గడలను ముక్కలుగా నరికి, పొలాల్లో వేసిన కాలువల్లో వేసి నీటిని వదులుతూ భూమిలోకి తొక్కుతారు. ఈ విధానంలో ఎకరాకు సుమారు 6 టన్నుల చెరకు విత్తనం కావాల్సి ఉంటుంది. టన్ను ఒక్కంటికీ సుమారు రూ. మూడు వేల పైచిలుకు పలుకుతుండగా, ఎకరం చెరుకు విత్తనానికి రూ. 20 వేలు, మందులు, ఇతర ఖర్చులు కలిపి ఎకరం సాగుకు రూ. 35 వేల వరకు ఖర్చు అవుతుంది. పంట చేతికి వచ్చే వరకు ఎకరాకు రూ. 55 వేల నుంచి రూ. 60 వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. ఎకరా పంట దిగుబడి 30 టన్నుల నుంచి 40 టన్నుల వరకు వస్తుంది.

### ఎకరాకు టన్ను విత్తనమే..

బడ్ చిప్ విధానంతో చెరకు సాగు చేస్తే మరిన్ని లాభాలు వస్తాయని అధికారులు చెబుతున్నారు. ఈ విధానంలో చెరకు గడల కన్నులు తొలగించి పాలి హౌస్‌లో నారుగా వేసి, మొక్కలను నాటాల్సి ఉంటుందని వివరిస్తున్నారు. ఈ విధానంలో ఎకరాకు టన్ను చెరకు విత్తనం సరిపోతుందని, అందులో వంద కిలోల కన్నులు(ముచ్చులు) పోగా, మిగితా 900 కిలోల చెరకును బెల్లం తయారీ, పాల వ్యాపారులకు విక్రయిస్తే కొంత ఖర్చు తగ్గుతుంది. టన్ను చెరకు విత్తనం రూ. 3 వేలకు పైగా ఉండగా, మందులు, ఇతర సాగు ఖర్చులు కలిపి ఎకరాకు రూ. 35 వేల వరకు ఖర్చు అవుతుంది. బడ్ చిప్ సాగులో టన్నుకు సుమారు 8 వేల మొక్కలు వస్తాయని, ఎకరాలో చెరుకు నాటేందుకు 7,500 మొక్కలు సరిపోతాయి.

### అవగాహన కల్పిస్తున్నాం..



రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నాం. చెరకులో బడ్‌చిప్ విధానంలో సాగు చేయాలని సూచిస్తున్నాం. ఈ విధానంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చు. కేవీకే ఆధ్వర్యంలో ఏటా కొన్ని గ్రామాలను ఎంపికచేసి రైతుల ఆసక్తి మేరకు చెరకునారును అందజేస్తున్నాం. రెండేళ్లుగా డీడీఎస్- కేవీకేలో పాలీ హౌస్‌లను ఏర్పాటు చేసి చెరకు నారు పెంచుతున్నాం. ఈ ఏడాది పది మంది రైతులకు చెరకు నారు అందజేయనున్నాం.

-రమేష్, డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త


చెరకు గడ కన్నులను వేరు చేసే యంత్రం


పంటను పరిశీలిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

### బాలికపై అత్యాచారం..

## నిందితుడికి జీవితఖైదు


నిందితుడు మీర్జాఅక్బర్

రామచంద్రాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ సంగారెడ్డి జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి కే.జయంతి సోమవారం తీర్పు చెప్పారు. తీర్పు వివరాలను కొల్లూరు పోలీసులు వెల్లడించారు. కొల్లూరు డబుల్‌బెడ్‌రూంలో నివాసం ఉండే మీర్జాఅక్బర్‌బేగ్ (44) 2004లో అదే కాలనీలో నివాసం ఉండే ఓ బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి ఒడిగట్టాడు. జరిగిన దారుణాన్ని ఆమె తల్లిదండ్రులు గమనించి కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు చేశారు. కేసు కేసు పూర్వపరాలు, సాక్షులు, సాంకేతిక ఆధారాలను పరిశీలించిన తరువాత న్యాయమూర్తి నిందితుడికి జీవితఖైదు, రూ.5వేల జరిమానా విధిస్తూ తుది తీర్పు వెలువరించారు. కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి, కోర్టుకు ఆదారాలను సమర్పించి నిందితుడికి శిక్ష పడటంలో కొల్లూరు ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఎస్సై బి. రవీందర్‌రెడ్డి, కానిస్టేబుళ్ల నర్సింలు, సమన్‌లను అధికారులు ప్రశంసించారు.

# ముగిసిన కోటి రుద్రాక్షల శివలింగోత్సవం


శివలింగానికి హారతి పడుతున్న మహేశ్వర శర్మ సిద్ధాంతి


మల్లికార్జునస్వామిని దర్శించుకున్న ఎంపీ ఈటల రాజేందర్

సంగారెడ్డి రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి మండలం ఫసల్‌వాది శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో ఏర్పాటు చేసిన 1.08 కోటి రుద్రాక్షల శివలింగోత్సవం సోమవారం ముగిసింది. ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో సోమవారం 360 మంది భక్తులు సౌందర్యలహరి, శివానందలహరి పారాయణం చేశారు. వారం రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 4 లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

### మల్లికార్జున స్వామిని దర్శించుకున్న ఈటల

ములుగు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా ములుగు మండలం బండమైలారం గ్రామంలో మల్లికార్జునస్వామి ఉత్సవాలకు సోమవారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట బీజేపీ ములుగు మండల అధ్యక్షులు మన్నె శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

# రిజర్వు ఫారెస్ట్‌లో చనిపోయిన కోళ్లు

### గుట్టుగా తెచ్చి డంప్ చేస్తున్న కొందరు

పుల్‌కల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం రిజర్వు ఫారెస్ట్‌లో కోళ్ల వ్యర్థాలను పారబోస్తున్నారు. కోళ్ల వ్యర్థాలను రిజర్వు ఫారెస్ట్‌లో బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తుండటంతో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. పుల్కల్, చౌటకూర్, అందోలు మండలాల్లోని ఆయా గ్రామాల శివారు ప్రాంతాల్లో రైతులు కోళ్ల ఫామ్‌లను నిర్వహిస్తున్నారు. కొన్ని రోజులుగా అంతుచిక్కని వ్యాధితో వేలాది కోళ్లు చనిపోతున్నాయి. వాటిని రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా ట్రాక్టర్లలో బొమ్మారెడ్డిగూడెం రిజర్వు ఫారెస్ట్‌లోకి తీసుకువచ్చి ఇష్టానుసారంగా పారబోస్తుండటంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. దుర్గంధం భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రిజర్వు ఫారెస్ట్‌లో పడేసిన చనిపోయిన కోళ్లు



# అడవిలో మంటలు


మంటలు ఆర్పుతున్న అటవీ శాఖ సిబ్బంది

కొండపాక, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమ్మంపల్లి అటవీ ప్రాంతంలో సోమవారం మంటలు లేచాయి. వందలాది ఎకరాలకు మంటలు వ్యాపించి అంటుకున్నాయి. మంటల్లో ప్రైవేటు వ్యక్తుల చెందిన భూముల్లో పంటలు దగ్ధమయ్యాయి. మామిడి తోటలకు తీవ్రనష్టం వాటిల్లింది. వల్లంగల్ల రాములు అనే రైతు ట్రాక్టర్ కాలిపోయింది. మంటలు గ్రామం వైపుకు చెలరేగడంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళన గురయ్యారు. వెంటనే ఫారెస్ట్ అధికారులకు, పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజన్ చేరుకొని సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో అడవిలో పలు చెట్లు కాలి పోయాయి.

### బార్ అండ్ రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం

చేర్యాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని ప్రవీణ్ బార్ అండ్ రెస్టారెంట్‌లో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా అగ్నిప్రమాదం సంభవించింది. బార్ అండ్ రెస్టారెంట్ కిచెన్ నుంచి బయటకు పొగ వెళ్లే చిమ్నిలో మంటలు చెలరేగి పక్కన ఉన్న వైర్లు అంటుకుని షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. దీంతో బార్ అండ్ రెస్టారెంట్‌లో ఉన్న జనం భయంతో ఒక్కసారిగా కేకలు వేస్తూ బయటకు పరుగులు పెట్టారు. గమనించిన నిర్వాహకులు మంటలు ఆర్పివేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. నిర్వాహకులు వెంటనే స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

### ఫిర్యాదుల వెల్లువ

మెదక్ అర్బన్/సంగారెడ్డి రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మెదక్, సంగారెడ్డి జిల్లాల కలెక్టరేట్లలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మెదక్ జిల్లాలకు సంబంధించి 24 ఆర్జీలు, సంగారెడ్డి జిల్లాకు సంబంధించి 7 ఆర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి పరిష్కరిస్తామని ఉన్నతాధికారులు తెలిపారు. అదేవిధంగా మెదక్ జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో డీఎస్పీ ప్రసన్నకుమార్ దరఖాస్తులను స్వీకరించారు.

### నేడు జాబ్ మేళా

నారాయణఖేడ్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణ శివార్లలోని మోడల్ కళాశాలలో మంగళవారం న్యూల్యాండ్ ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జి.నారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తయిన, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగినవారు స్టడీ సర్టిఫికెట్స్, ఆధార్ కార్డు, నాలుగు పాస్ ఫొటోలు తీసుకొని రావాలని పేర్కొన్నారు.

### పరీక్షా ప్యాడ్లు పంపిణీ

సంగారెడ్డి అర్బన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో సంగారెడ్డి మండలం కొత్లాపూర్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే కళాశాలలోని విద్యార్థినులకు హ్యాపీ డెంటల్ కేర్ ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్లు, స్టేషనరీ కిట్‌ను అందజేశారు. హ్యాపీ డెంటల్ కేర్ వైద్యులు డా.శిల్పముదిరాజ్ చేతుల మీదుగా సుమారు 150 మందికి అందజేశారు.

### రూ.1.40లక్షల విరాళం

జిన్నారం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నూతన దేవాలయాలకు సీజీఆర్ ట్రస్టు తరఫున రూ.1.40 లక్షల విరాళాలు అందజేశారు. కాజీపల్లిలో కాశీ విశాలాక్షి, విశ్వనాథ స్వామి దేవాలయానికి రూ.లక్ష, సోలక్‌పల్లిలోని లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయ నిర్మాణానికి రూ.40వేలు ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అందజేశారు. .

### ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

● మెదక్ అదనపు కలెక్టర్

మెదక్ అర్బన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ మెంచు నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక బృందాలు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. సమస్యలు లేని దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే కలెక్టరేట్‌లో రంజాన్ పండుగ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులు, శాంతి కమిటీ సభ్యులతో అదనపు కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు.

### ఎల్ఆర్ఎస్ ఫీజులో 25 శాతం రాయితీ

ఐడీఏబొల్లారం మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఐడీఏబొల్లారంలో సోమవారం కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020లో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసిన తరువాత నిర్మాణం చేసిన ప్రతి ఒక్కరూ 25 శాతం రాయితీపై ఫీజు చెల్లించవచ్చునన్నారు. ఈ నెల 31వ తేదీ లోపు చెల్లించిన వారికి రాయితీ వర్తిస్తుందన్నారు.

● అమీన్‌పూర్ : ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన విధంగా 25శాతం ఫీజు రాయితీతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను సత్వరం పరిష్కరించేందుకు ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పరిష్కార కేంద్రాన్ని సోమవారం ఆమె ప్రారంభించి విలేకరులతో మాట్లాడారు. సందేహాలు ఉంటే 9885678997 నంబర్ ద్వారా సంప్రదించాలన్నారు.

### 'ఉపాధి' పనులపై సమీక్ష

పెద్దశంకరంపేట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులపై సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఉపాధిహామీ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు.



# ఇలా కూల్చితే.. అలా నిర్మాణం..

● కాజీపల్లిలో రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు
● నామమాత్రపు చర్యలకే పరిమితమైన అధికారులు
● క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజల విజ్ఞప్తి

జిన్నారం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం కాజీపల్లిలో 181 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు వెలుస్తూనే ఉన్నాయి. ఓ వైపు అధికారులు కూల్చివేస్తుండగా, మరోవైపు కబ్జాదారులు యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. కూల్చినచోట్లలో తిరిగి రాత్రికి రాత్రే నిర్మాణాలు వెలుస్తుండడం గమనార్హం. ఈ స్థలంలో సూచిక బోర్డులు, ఫెన్సింగ్ వంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో కబ్జారాయుళ్లు రెచ్చిపోతున్నారు. తరచూ విలువైన భూముల ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు నామమాత్రంగా చర్యలు తీసుకుని వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఔటర్ రహదారికి పక్కనే ఉండడం, ఎకరం రూ.15 కోట్ల వరకు పలుకుతుండడంతో కబ్జాదారులు కాజేయాలని చూస్తున్నారు. ఒకటి రెండు గదులు నిర్మించి రూ.6లక్షలు నుంచి రూ.10 లక్షల వరకు అమయాకులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. జనవరిలో 10 వరకు అక్రమ కట్టడాలు కూల్చివేయగా, తిరిగి మరో 6 నిర్మాణలు వెలియడంతో అధికారులు మళ్లీ కూల్చివేశారు. అధికారులు కూల్చివేయడంతో అక్రమార్కులు తిరిగి నిర్మాణాలు చేపట్టడం పరిపాటిగా మారింది. ఇలా కాకుండా కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి తిరిగి ఆక్రమణలు జరగకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

#### ఆరు నిర్మాణాల కూల్చివేత..

జిన్నారం మండలం కాజీపల్లిలో 181 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన ఆరు కట్టడాలను సోమవారం అధికారులు నేలమట్టం చేశారు. ఆర్ఐ జయప్రకాష్ నారాయణ, రెవెన్యూ సిబ్బందితో కలిసి దగ్గరుండి కూల్చివేయించారు. అలాగే కిష్టాయ్యపల్లి, గడ్డపోతారం ప్రాంతాల్లో పరిశ్రమలకు ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తుండగా.. ఆర్ఐ అడ్డుకొని వాహనాల టైర్లలో గాలి తీసివేశారు.



### ప్రభుత్వ బడుల్లో ఏఐ కార్యక్రమం

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సాఫ్ట్‌వేర్ రూపొందించిన బెంగళూర్ బృందంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఐ బోధన అమలుపై బెంగళూర్ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి, సాఫ్ట్‌వేర్‌లో నెలకొన్న సమస్యలను నివృత్తికి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. సమావేశంలో డీఈవో రాధాకిషన్, బృందం సభ్యులు అనంతి ఆకాష్, ప్రీతి పాల్గొన్నారు.

### పన్నులు చెల్లించండి

జహీరాబాద్, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : పన్నులు చెల్లించి పట్టణ ప్రగతికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వర రావు పేర్కొన్నారు. సోమవారం జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయానికి పలువురు స్థానికులు పెండింగ్‌లో ఉన్న పన్నులను చెల్లించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నులను చెల్లిస్తేనే పట్టణ ప్రగతి సాధ్యమవుతుందన్నారు.

### రూ.11.12 కోట్లు వసూలు

ఐడీఏబొల్లారం మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్నులు త్వరితగతిన చెల్లింపులు జరపకపోతే జరిమానా విధించాల్సి ఉంటుందని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు సోమవారం ఐడీఏబొల్లారం పట్టణంతో పాటు పారిశ్రామికవాడలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. సిబ్బంది ఇంటింటికి వెళ్లి పన్నులు వసూలు చేశారు. రూ.16.19కోట్లకు గాను, ఇప్పటివరకు రూ.11.12 కోట్లు వసూలు చేశారు.



రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరిన నాయకులు

### పార్టీ పటిష్టతకు కృషి చేయాలి : ఎంపీ

జిన్నారం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయి నుంచి పార్టీ పటిష్టత కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. సోమవారం ఎంపీ సమక్షంలో మాధారం, మంత్రికుంట గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి పాల్గొనగా.. అశోక్, శంకర్, రమేష్, సత్యనారాయణ, నవీన్, శేఖర్ సహా 30మంది బీజేపీలో చేరారు.

### అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు : ఎమ్మెల్యే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ గృహాలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొదటి దశలో నియోజకవర్గానికి 3500 గృహాలు మంజూరైనట్లు తెలిపారు. అందులో సొంత స్థలం ఉండి అర్హులైనవారికి మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు. పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపామన్నారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ చౌహాన్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

హత్నూర, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో అవకతవకలను వెలుగు చూశాయి. హత్నూర రైతు వేదిక ఆవరణలో సోమారం సామాజిక తనిఖీ బృందం బహిరంగ విచారణ చేపట్టింది. 2023-24 కాలంలో మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన పనులపై వారం రోజులుగా క్షేత్ర స్థాయి విచారణ చేపట్టి లోటుపాట్లు, అక్రమాలను గుర్తించారు. మెజార్టీ గ్రామాల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలన చేయడంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్న ఆరుగురు ఫీల్డ్ అసిస్టెంట్లకు ఒక్కొక్కరికీ రూ.1000 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రెసిడింగ్ ఆఫీసర్ అడిషనల్ పీడీ బాలరాజ్, డీవీవో నాగేశ్వరరావు, ఎంపీడీవో శంకర్, ఎస్ఆర్పీ కవిత, ఏపీవో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

● చేగుంట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2023-24 సంబంధించిన ఉపాధి హామీ పనులపై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు సామాజిక తనిఖీ నిర్వహించారు. మొత్తం రూ. 8.23 కోట్ల నిధుల వినియోగంపై సామాజిక తనిఖీ నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో లేని వ్యక్తుల పేర హాజరు వేసి డబ్బులు దుర్వినియోగం చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు రూ.88,589 రికవరీ చేసినట్లు డీఆర్డీఏపీడీ శ్రీనివాసరావు తెలిపారు. అదేవిధంగా పనులలో పొరపాట్లు చేసిన పొరపాట్లు చేసిన ఉపాధి హామీ సిబ్బందికి రూ.44 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీహరి, ఎస్ఆర్పి రమేష్, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఏపీఓ శ్వేత తదితరులు పాల్గొన్నారు.



హత్నూర : సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు



## తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

మెదక్ కల్చరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మెదక్ మండలం పాతూరు గ్రామంలో సోమవారం మహిళలు ఖాళీ బిందెలతో రాస్తారోకో నిర్వహించారు. వారం రోజులుగా తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పట్టించుకొనే వారే లేరని వాపోయారు. మెదక్-రామాయంపేట ప్రధాన రహదారిపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీరు అందించాలని, లేకుంటే ఆందోళనలో ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీనం

కొల్చారం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కొల్చారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించారు. దీనిపై గ్రామస్థులు పలుమార్లు జిల్లా అధికారులకు, మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు స్పందించిన రెవెన్యూ అధికారులు సోమవారం కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. తేనెకుంటలో 4.20 ఎకరాలు, కప్పలకుంటలోని 4 ఎకరాలతో పాటు, మరో 4 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ ప్రభాకర్, పోలీసలు పాల్గొన్నారు.



కొల్చారం : హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

● హవేళిఘణపూర్, మార్చి3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సింధురేణుక హెచ్చరించారు. సోమవారం మండలకేంద్రంలోని నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఏఎస్ఐ సమియోద్దీన్, గిర్దవార్ అబేద్, నర్సింహులు, తదితరులున్నారు.

## రోబోటిక్స్ ఎగ్జిబిషన్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న జిల్లా విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) :హైదరాబాద్ ఉప్పల్‌లోని మినీ శిల్పారామంలో సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి రోబోటిక్ ప్రదర్శనకు సంగారెడ్డి జిల్లాలోని 11 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 260 పాఠశాలల నుంచి 390 మంది విద్యార్థులు తమ నైపుణ్యంతో రోబోటిక్స్ అంశంపై తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. జిల్లా నుంచి ఏడు పాఠశాలలు డైమండ్ లెవెల్‌కి ఎంపికైనట్లు సోహం అకాడమీ వ్యవస్థాపకులు కోమగిరి సహదేవ్ తెలిపారు. వీరిని డీఈవో వెంకటేశ్వర్లు, డీసీఈబీ సెక్రటరీ లింబాజి తదితరులు అభినందించారు.



నర్సాపూర్‌లోని ఎంపీపీఎస్ పాఠశాలలో..

### ఉన్నత విద్యతో భవిష్యత్తులో రాణించాలి: డీఈవో

మనోహరాబాద్/ తూప్రాన్/నర్సాపూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఉన్నతంగా చదివి భవిష్యత్తులో రాణించాలని జిల్లా విద్యాధికారి డాక్టర్ రాధాకిషన్ పేర్కొన్నారు. సోమవారం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (బెంగళూర్) బృందంతో కలసి మెదక్ జిల్లా తూప్రాన్, మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలోని ప్రైమరీ స్కూల్‌లో, నర్సాపూర్‌లోని ఎంపీపీఎస్-2 పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏఐ ల్యాబ్‌ను పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా తెలిపారు. బెంగుళూరు నుంచి వచ్చిన ఈ కె ఫౌండేషన్ సాంకేతిక బృందం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేసింది.

### వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు

● ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాస్

నర్సాపూర్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్ డివిజన్ పరిధిలోని ఏఈలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ప్రస్తుతం తాగునీటి సమస్య లేదన్నారు. వేసవి దృష్ట్యా 65 గ్రామాల్లో నీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ తరుణంలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా గ్రామంలోని, వ్యవసాయ బోర్ల నుంచి నీటిని సరఫరా చేసేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## నేటి నుంచి భగీరథ నీటి సరఫరా

● దశాబ్దాల తాగునీటి సమస్యకు పరిష్కారం

ఐడీఏబొల్లారం ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఐడీఏబొల్లారం పురపాలక పట్టణంలో 400 పైచిలుకు పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో వివిధ రాష్ట్రాలకు చెందిన 60 వేలపైగా కార్మికులు పనిచేస్తూ స్థానికంగా నివాసం ఉంటున్నారు. వీరంతా నిత్యం తాగునీటిని కొనుగోలు చేస్తున్నారు. నీటి ప్లాంట్ల నిర్వాహకులు బోరునీటిని శుద్ధి చేసి మినరల్ వాటర్ పేరుతో అమ్ముతున్నారు. అవి సైతం కలుషితంగా ఉండటంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. దీనిపై అధ్యయనం చేసిన నిపుణులు భూఉపరితలంపై నుంచి తాగునీటిని సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వానికి చేసిన సిఫార్సు చేసింది. ఈ మేరకు మంగళవారం నుంచి ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు సరఫరా చేయడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దీంతో దశాబ్దాల నీటి సమస్యకు పరిష్కారం లభించనున్నది. రూ.20కోట్లు వెచ్చించి అన్ని ప్రాంతాలకు పైపులైన్‌లు వేశారు. 45 లక్షల లీటర్ల నీరు నిల్వ చేసే సామర్థ్యం కలిగిన రెండు రిజర్వాయర్లు నిర్మించారు. మున్సిపల్ ఇప్పటికే సరఫరా చేస్తున్న నల్లాల కనెక్షన్‌ల వివరాలు తీసుకున్నారు. ఆయా వివరాల ఆధారంగా గుర్తింపు సంఖ్య (క్యాన్‌నంబరు) ఇస్తారు. ఇప్పటికే ఆన్‌లైన్ విధానంలో 4500 మందికి కేటాయింపులు జరిపారు. 2 వేల మందికి నూతనంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. వారికి ఎప్పటికప్పుడు నంబర్లు కేటాయించి నెలవారి నీటి బిల్లులు చెల్లింపులు జరపడానికి అవకాశం కల్పిస్తారు. మంగళవారం నుంచి మున్సిపల్‌తో సంబంధం లేకుండా జలమండలి అధికారులు నీటిని సరఫరా చేయడంతో పాటు బిల్లులు వసూలు చేయనున్నారు. అన్ని బస్తీల్లో తిరిగి నల్లా కనెక్షన్ ఇస్తున్నామని, దరఖాస్తు చేసుకోవాలని ఐడీఏబొల్లారం జలమండలి ఏఈ శ్రీనివాస్ సూచించారు



డ్రమ్ముల్లో తాగునీటిని పట్టుకుంటున్న పట్టణవాసులు



మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని పరామర్శిస్తున్న కాంగ్రెస్ నేత నీలం మధు

### మాజీ ఎమ్మెల్యేకు నీలం మధు పరామర్శ

నర్సాపూర్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి ఇటీవల ఓపెన్‌హార్టు సర్జరీ అయింది. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంటు ఇన్‌చార్జి నీలం మధు సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని మదన్‌రెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. మదన్‌రెడ్డి త్వరగా కోలుకుని మళ్లీ ప్రజాక్షేత్రంలో చురుకుగా పాల్గొనాలని ఈ సందర్భంగా నీలం మధు ఆకాంక్షించారు.

### లింగ నిర్ధారణ, భ్రూణ హత్యల నియంత్రణకు స్పెషల్ డ్రైవ్

మెదక్ కల్చరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : లింగ నిర్ధారణ, భ్రూణ హత్యల నియంత్రణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు మెదక్ జిల్లా వైద్యాధికారి శ్రీరాం తెలిపారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ నవీన్, సునీత దేవి, డాక్టర్ సృజన , డాక్టర్ జ్ఞానేశ్వర్ , డాక్టర్ మాధవి , డాక్టర్ వినయ్ సుశీల్, డాక్టర్ శివ దయాల్, శ్రీనివాసులు డిప్యూటీ డెమో, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### కలెక్టర్‌కు ఫిర్యాదు

రామచంద్రాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పట్టాభూమిలో ప్రభుత్వ అధికారులు అభివృద్ధి పనులు చేపట్టారంటూ ఉస్మాన్‌నగర్ గ్రామానికి గాండ్ల రాములు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని పట్టా సర్వేనంబరు 4 'లు'లో 2.22 ఎకరాల భూమి ఉందని, ఇందులోని 14 గుంటల భూమిలో ప్రభుత్వం ఎలాంటి పరిహారం చెల్లించకుండా గ్రామానికి సీసీ రోడ్డు వేసిందన్నారు. ఈ విషయమై హైకోర్టును కూడా ఆశ్రయించినట్లు తెలిపారు. నెల రోజుల క్రితం మిగిలి ఉన్న భూమిలో సైతం రెయిన్ వాటర్ డ్రైనేజీని నిర్మించారని, న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.


### అసైన్డ్ భూమి పరిశీలన

ఝరాసంగం, మార్చి 3(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని మాచునూర్ గ్రామ శివారులోని సర్వే నంబరు 100 లో గల అసైన్డ్ భూమిని కోర్టు ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ తిరుమలరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ 4 ఎకరాలకు సంబందించిన భూమి వివాదం కొనసాగుతుండగా అందులో ఓ పార్టీ టీఎం-33 కింద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుందన్నారు. అందులో భాగంగానే భూ పరిశీలన చేసినట్లు తెలిపారు. ఇంకా స్పష్టత రాలేదని, మారోమారు అక్కడి వెళ్లి విచారణ జరిపి ఉన్నత అధికారులకు నివేదిక పంపుతామన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లాదుర్గం, మార్చి 3. (ఆంధ్రజ్యోతి) మండలంలోని గడిపెద్దాపూర్‌లోని 33/11 కేవి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని స్థానిక ఇన్‌చార్జి ఏఈ నవాజ్ సోమవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

### కనీస వేతనాలు రూ.26 వేలు చెల్లించాలి



జిన్నారం : మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

సంగారెడ్డి రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పెరిగిన ధరలకనుగుణంగా కార్మికులకు కనీస వేతనాలు రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డిలో సోమవారం డీసీఎల్ రవీందర్‌రెడ్డికి సీఐటీయూ నాయకులు వినతి పత్రం అందజేశారు.

● జిన్నారం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ద్వారానే కార్మిక సమస్యల పరిష్కారం సాధ్యమని రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు అన్నారు. సోమవారం కాజీపల్లి పారిశ్రామిక వాడలోని టీబీడీసీ పరిశ్రమలో జరిగిన కార్మికుల సమావేశానికి సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు హాజరై మాట్లాడారు